క్లుప్తంగా

102 అంబులెన్స్‌ను వినియోగించుకోవాలి



102 అంబులెన్స్‌లో వచ్చిన గర్భిణులు, బాలింతలు, ఆశావర్కర్లు

సుల్తానాబాద్: గర్భిణులు, బాలింతలు 102 అంబులెన్స్‌ను వినియోగించుకోవాలని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి కోరారు. మండలంలోని పలు గ్రామాల గర్భిణులు, బాలింతలను గురువారం తీసుకొని రాగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సుల్తానాబాద్‌తో పాటు ఎలిగేడు, జూలపల్లి, కొలనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి 102 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి వచ్చి ఉచితంగా ప్రసవంతో పాటు వైద్య సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. 102 సిబ్బంది రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం గుంటూరుపల్లిలో సామూహిక మరుగుదొడ్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా మారాయి. దీంతో బుధవారం సాక్షిలో 'నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్లు' కథనాన్ని ప్రచురితమైంది. స్పందించిన గ్రామపంచాయతీ అధికారులు గురువారం పిచ్చి మొక్కలను తొలగించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. సామూహిక మరుగుదొడ్లు అందుబాటులోకి వచ్చేలా కృషిచేసిన 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీతకు సన్మానం



సన్మానిస్తున్న మండల విద్యాధికారి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న తాడూరి సంపత్ కుమార్‌ను రామగిరి మండలం చందనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం సన్మానించారు. ఈ ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా చందనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో మండల విద్యాధికారి కొమురయ్య, పాఠశాల హెచ్ఎం లక్ష్మితో పాటు ఉపాధ్యాయులు సంపత్‌కుమార్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. పదోన్నతి పొందిన వ్యాయామ ఉపాధ్యాయుడు సమ్మయ్యను సత్కరించారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన శాత్రాజుల సతీశ్ కుటుంబానికి గురువారం దాతలు ఆర్థికసాయం అందజేశారు. లారీడ్రైవర్‌గా విధులు నిర్వహించే సతీశ్ ఇటీవల పాము కాటుకు గురై మరణించాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో గ్రామానికి చెందిన పెద్దపల్లి కల్కి ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించిన రూ.31,020, బసంత్‌నగర్ ఫ్లెయాష్ ట్యాంకర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రూ.25వేలు సతీశ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. పెద్దపల్లి నాగరాజు, మాదాసు సంతోష్, నంది వెంకటేశ్, దారవేణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

సుల్తానాబాద్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ హాస్టల్ విభాగం జిల్లా కన్వీనర్ రాసూరి ప్రవీణ్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఏబీవీపీ పేర్కొన్నారు. వినయ్, ప్రకాశ్, రాము, కార్తీక్, సాత్విక్, విష్ణు, శ్రీనాథ్, రంజిత్, సిద్దార్థ, శివకుమార్, మహేశ్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

- మూలకు పడేసిన మూడు బాడీఫ్రీజర్లు



మూలకు పడేసి ఉన్న బాడీ ఫ్రీజర్లు

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రూ.లక్షలు వెచ్చించి మూడు బాడీ ఫ్రీజర్లతో కూడిన వైకుంఠ రథాలను డీఎంఎఫ్‌టీ నిధులతో మూడేళ్ల క్రితం కొనుగోలు చేశారు. వైకుంఠ రథాలను వినియోగంలోకి తెచ్చినప్పటికీ, బాడీ ఫ్రీజర్లను మాత్రం ఇలా నిర్లక్ష్యంగా మూలకు పడేశారు. మెప్మా భవనంలోని దివ్యాంగుల సమాఖ్య కేంద్రం ఎదుట హాల్‌లో ఉన్న ఈ మూడు బాడీ ఫ్రీజర్లను, ఇటీవల క్యాంటీన్ ఏర్పాటు కోసం తొలగించి, వాటిని మీ సేవా కేంద్రం ఎదుట హాల్‌లో పడేశారు. కాగా నగరంలో పలువురు ప్రైవేటు వ్యక్తులు బాడీ ఫ్రీజర్లను అద్దెకు ఇస్తున్నప్పటికీ, రోజుకు రూ.4వేలకు పైగా వసూలు చేస్తున్నారు. స్థానిక లయన్స్ క్లబ్ సంస్థ నిర్వాహకులు కూడా రూ.2వేలు డిపాజిట్ కింద చెల్లిస్తే, రోజుకు రూ.వెయ్యి అద్దెతో బాడీ ఫ్రీజరు ఇస్తున్నారు. ఇంత డబ్బులు చెల్లించుకోలేని నిరుపేదలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బాడీ ఫ్రీజరును అందుబాటులోకి తీసుకురావాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. వెంటనే మూడు బాడీ ఫ్రీజర్లను వినియోగంలోకి తేవాలని అధికారులను సామాజిక కార్యకర్త మద్దెల దినేశ్ డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



పెద్దపల్లిరూరల్: ఆందోళన చేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యజమానులు

జ్యోతినగర్: రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా ప్రయివేట్ కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను సత్వరమే విడుదల చేయాలని అధ్యాపకులు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం తెలంగాణ ప్రయివేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆందోళన చేపట్టారు. నా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరారు.

బకాయి నిధులు చెల్లించాలి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి గురువారం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల యజమాన్య సంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందించారు.

సుల్తానాబాద్: మండల కేంద్రంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు.

కాల్వశ్రీరాంపూర్: విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని యూఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాగమల్ల సురేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న సంధ్యారాణి

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్రంలోని రైతులకు ఆగస్టు 15 వరకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని బీజేపీ రామగుండం నియోజకవర్గ నాయకురాలు కందుల సంధ్యారాణి ఆరోపించారు. యైటింక్లయిన్‌కాలనీలో గురువారం చేపట్టిన పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిత్యం ముందుండి ప్రజా పోరాటాలు చేస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం కృషి చేస్తానని తెలిపారు. నాయకులు రాజేశ్‌నాయక్, శారద, లీలా, సరిత, హైమావతి, కవిత, దివ్య, భాగ్యవతి, సౌజన్య, వనజ, మాధవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రామగుండం: విజేతలతో ఉపాధ్యాయులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతికి చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు గురువారం పాఠశాల హెచ్.ఎం.సంగీత తెలిపారు. ఈనెల 16న గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 18–20వ తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎండీ.అస్మా, కె.ఇందు పాల్గొంటారన్నారు.



పాలకుర్తి: అభినందిస్తున్న కరస్పాండెంట్

విద్యార్థులకు అభినందన

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని యూనివర్సల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్ తెలిపారు. గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు రిషిత, అస్తాసింగ్, అంత్ర చౌరాషియా ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారికి ఇరువైపుల నిర్మించిన ఫుట్‌పాత్‌లపై అక్రమ కట్టడాలు, పందిర్లు, రేకుల షెడ్లను గురువారం టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది జేసీబీ వాహనంతో తొలగించారు. కొందరు బల్దియా సిబ్బందిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. స్వచ్ఛందంగా తొలగించుకోకపోతే, జేసీబీతో పూర్తిగా కూల్చివేస్తామని అధికారులు తెలిపారు.

పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



సూచనలు చేస్తున్న ఏసీపీ మడత రమేశ్

యైటింక్లయిన్‌కాలనీ: పోలీసులు నిరంతరం విధుల్లో అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ అన్నారు. గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. టూటౌన్ సీఐ ఎన్.ప్రసాద్‌రావు, రెండో సీఐ లింగమూర్తి, ఎస్సైలు వెంకటకృష్ణ, ఫరీద్, సోనియా పాల్గొన్నారు.

కళోత్సవాల్లో ఎలిగేడు విద్యార్థినికి ప్రథమ బహుమతి



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో

ఎలిగేడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కోడూరి సాహిత్య జిల్లాస్థాయి కళోత్సవాల్లో భాగంగా దృశ్య కళలో మొదటి బహుమతి సాధించింది. ఈ సందర్భంగా సాహిత్యను గురువారం ఎంఈవో ఎ.నరేంద్రచారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగ్ర దేవేందర్‌రావు అభినందిచారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



తనిఖీ చేస్తున్న పోలీసులు

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో కన్నాల టోల్‌ప్లాజా వద్ద ఫోర్‌లైన్ రహదారిపై గురువారం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్సై స్వామి పాల్గొని పూర్తిస్థాయిలో పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **విద్యానిధి పథకం దరఖాస్తుకు 29 వరకు గడువు**

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్‌సీస్ విద్యానిధి పథకం కింద ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఈనెల 29వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎస్సీ అభివృద్ధి అధికారి తెలిపారు. అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్‌కొరియా తదితర దేశాల్లో చదువు కోసం వెళ్లే విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తామని వివరించారు.

- **ఉద్యమకారుల ఫోరం పాలకుర్తి మండల అధ్యక్షుడిగా ఖాదర్ పాషా**

పాలకుర్తి: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా కన్నాల గ్రామానికి చెందిన సయ్యద్ ఖాదర్‌పాషాను నియమించినట్లు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు గుండేటి అయిలయ్యయాదవ్‌తో పాటు ఇతర జిల్లా నాయకులకు ఖాదర్‌పాషా కృతజ్ఞతలు తెలిపారు.

- **ఫోరం మండల అధ్యక్షుడిగా సదయ్య**

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా అందుగులపల్లికి చెందిన దామ సదయ్య నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు ఐలయ్యకు సదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

- **పురుగు మందుల వినియోగంపై అవగాహన**

జూలపల్లి: మండలంలోని తెలుకుంటలో రైతులకు పురుగు మందుల వినియోగం దుష్ప్రభావాలపై డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా నవక్రాంతి ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. స్థానిక గ్రామపంచాయతీ వద్ద రైతులకు బీసీఐ ప్రాజెక్టు ఆవశ్యకతను ఫీల్డ్ ఆఫీసర్ చంద్రలీల, ఏపీయూ మేనేజర్ మాధవి మాట్లాడారు. మోనోక్రోటోఫాస్ లాంటి పురుగు మందులు వాడొద్దని, వాటి ద్వారా క్యాన్సర్ జన్యు ఉత్పరివర్తన ప్రత్యుత్పత్తికి సంబంధించిన వ్యాధులు వస్తాయని వివరించారు. మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లద్దాలు, గ్లౌజులు, బూట్లు వాడాలని సూచించారు. రైతులు హనుమంతరెడ్డి, రవీందర్‌రెడ్డి, భరత్, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

- **పౌష్టికాహారంపై అవగాహన ఉండాలి**

జూలపల్లి: బాలికలు ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత, చైల్డ్‌లైన్ కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. మండలంలోని వడ్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కల్పించారు.

- **గ్రామాల్లో ఉపాధిహామీ సభలు**

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 30వ తేదీ వరకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవోతో పాటు ఎంపీవో, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులతో కూడిన ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. గురువారం ఈసాలతక్కళ్ళపల్లిలో గ్రామసభ నిర్వహించారు.

- **కేజీబీవీల్లో ఖాళీల భర్తీ పూర్తి**

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పది కేజీబీవి పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టులను భర్తీ చేశామని డీఈవో మాధవి తెలిపారు. గురువారం డీఈవో కార్యాలయంలో సదరు అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు.

- **గ్యార్మీ షరీఫ్ వేడుకలు**

రామగుండం: పట్టణంలోని మూతపడిన బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో గురువారం ముస్లింలు గ్యార్మీ షరీఫ్ వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బీ–థర్మల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.విజేందర్, డీఈ కోలాహలం శ్రీనివాస్‌రావు, మహ్మద్ ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

- **వాహనదారులు హెల్మెట్ ధరించాలి**

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: వాహనంపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ప్రతీఒక్కరు హెల్మెట్ ధరించాలని సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని కాల్వశ్రీరాంపూర్ క్రాస్‌రోడ్ వద్ద గురువారం వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనంపై వెళ్లేటప్పుడు నిబంధనలు పాటించాలన్నారు. కానిస్టేబుల్ రాకేశ్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

- **పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం**

ఎలిగేడు: పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈనెల 7, 8వ తేదీలలో హైదరాబాద్‌లో జరిగాయి. సమావేశాల్లో ఎలిగేడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జె.సత్యనారాయణను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా, ధూళికట్ట జెడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్.రవీందర్‌రావును రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- **రోడ్డుకు మరమ్మతు**

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వెన్నంపల్లిలో నల్లకుంట చెరువు వైపు, కొత్తకుంట చెరువు వైపు, పెద్దచెరువు వైపు, పిల్లల బొంద ఒర్రెపై నుంచి వ్యవసాయ దారులు రాకపోకలు సాగించేందుకు గురువారం రోడ్డుపై ఏర్పడ్డ గుంతలపై మొరం పోసి చదును చేశారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఆదేశాలతో మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. ఎమ్మెల్యేకు, మాజీ ఎంపీపీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

- **బాలల హక్కులపై అవగాహన సదస్సు**

రామగిరి: మండలంలోని నాగెపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం బాలల హక్కులపై విద్యార్థులకు చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ రేనుకుంట్ల సతీశ్ అవగాహన సదస్సు నిర్వహించారు.

సింగరేణి వార్తలు

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



మాట్లాడుతున్న ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణిలోనే ఆర్జీ–1 ఏరియాను అగ్రగామిగా నిలపాలని జీఎం లలిత్‌కుమార్ కోరారు. గురువారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన ఉజ్వల సింగరేణి, ఉద్యోగుల పాత్ర అంశంపై మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశానికి కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామితో కలిసి హాజరై మాట్లాడారు. రక్షణతో కూడిన ఉత్పత్తితో పాటు ఉత్పాదకత సాధించాలన్నారు. కార్మికుల కష్టాన్ని గుర్తించి లాభాల వాటాతో పాటు అన్ని గనులపై సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారన్నారు. అనంతరం జీఎం కార్యాలయంలో భోజనాల కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో క్వాలిటీ జీఎం భైద్యా, సేఫ్టీ రీజియన్ జీఎం గుప్తా, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, అధికారులు కుమారస్వామి, జితేందర్‌సింగ్, హన్మంతరావు, కర్ణ, ధనలక్ష్మిబాయి పాల్గొన్నారు.

2003 గని ప్రమాద మృతులకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: జీడీకే–8ఏగనిలో 2003లో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన 17మంది కార్మికులకు గురువారం నివాళి అర్పించారు. ఓసీపీ–3 సైటాఫీస్ సమీపంలోని మృతుల జ్ఞాపకార్థం నిర్మించిన స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి గత ప్రమాద సంఘటనను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, ఉపాధ్యక్షులు అయిలి శ్రీనివాస్, బేతి చంద్రయ్య, అబ్బు శ్రీనివాసరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు జీగురు రవీందర్, రాజారత్నం, అన్నారావు, ఎజ్జ రాజయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు కొత్త సత్యనారాయణరెడ్డి, సంపత్‌రెడ్డి, బీఎంఎస్ నాయకులు సారంగపాణి, సీఐటీయూ నాయకులు ఉల్లి మొగిలి, ప్రవీణ్, బాధిత కుటుంబ సభ్యులు తిరుపతి, రాజసమ్మయ్య దీపక్ పాల్గొన్నారు.

గనిలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి: గనిలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని, వారు బాధ్యతలు తెలుసుకొని విధులు నిర్వహించాలని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఎంవీటీసీలో ఏపీఏ గనిలో విధులు నిర్వహిస్తున్న 15 మంది ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల శిక్షణ ముగింపు తరగతులకు గురువారం హాజరై మాట్లాడారు. గనిలో వివిధ పని ప్రదేశాలను నిర్ణీత సమయాల్లో తనిఖీ చేసి ప్రమాద అవకాశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సహచర ఉద్యోగులకు భద్రతపై సరైన అవగాహన కల్పించాలని, భద్రతతో కూడిన విధులు నిర్వహించేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. మేనేజర్ మల్లన్న, ఎస్ఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జీఎం ఎన్.సుధాకర్‌రావు

రామగిరి: ఆర్జీ–3 డివిజన్‌లోని ఓసీపీ–2లో కొన్నిరోజుల క్రితం జరిగిని ప్రమాదంలో సింగరేణి కార్మికుడు ఉప్పుల వెంకటేశ్వర్లు మరణించాడు. కాగా అతని సతీమణి ఉప్పుల సరోజనకు గురువారం ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు, గోదావరిఖని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రవీంద్ర కుమార్ సింగ్ కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ కె.రవీంద్ర, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి గ్రంథి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి జె.రాజశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డీపీఎం గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.

సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం



మాట్లాడుతున్న రాజిరెడ్డి

గోదావరిఖని: మితిమీరిన రాజకీయ జోక్యంతో సింగరేణి సంస్థ అభాసుపాలవుతోందని తెలంగాణా బొగ్గుగని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. గురువారం యూనియన్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బడాఖాన పేరుతో ఉత్పత్తి లక్ష్యాలను మరిచి కార్మికుల మధ్య చిచ్చుపెట్టే విధంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఉత్పత్తి లక్ష్యాల మీద అవగాహన లేని వ్యక్తులను స్టేజీలపై కూర్చోబెట్టి కార్మికులు, అధికారులను అవమానపరుస్తున్నారని తెలిపారు. దీనిని ప్రశ్నించే కార్మికులు, ఉద్యోగులకు చార్జిషీట్లు ఇస్తామని కొందరు అధికారులు బెదిరిస్తున్నారన్నారు. ఈపద్ధతి మార్చుకోవాలని సూచించారు. సంస్థ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ముందుండి పోరాటాలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మాదాసు రామమూర్తి, నూనె కొమరయ్య, వడ్డేపల్లి శంకర్, చెల్పూరి సతీశ్, కొండ్ర అంజయ్య, రొడ్డ సంపత్, ఉప్పులేటి తిరుపతి, మీసరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ నాయకులు ఎ.వెంకన్న, బి.అశోక్ కోరారు. సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. సంస్థవ్యాప్తంగా సుమారు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పర్మనెంట్ కార్మికులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి న్యాయమైన వేతనాలు అందడం లేదన్నారు. జాతీయ పండుగ సెలవులు ఇవ్వడం లేదని, ఖాళీగా ఉన్న క్వార్టర్లు కేటాయించాలని, సిక్ లీవులు వర్తింపజేయాలని కోరారు. నాయకులు బ్రహ్మానందం పాల్గొన్నారు.





రామగిరి: నివాళి అర్పిస్తున్న ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు, గోదావరిఖని: ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ

వాల్మీకి మహర్షి జయంతి

పెద్దపల్లిరూరల్/కోల్‌సిటీ/గోదావరిఖని/రామగిరి/కాల్వశ్రీరాంపూర్/ఎలిగేడు/సుల్తానాబాద్/గోదావరిఖనిటౌన్/జూలపల్లి/మంథని: మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



కోల్‌సిటీ: బల్దియా కార్యాలయంలో..

పరామర్శ

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మాజీ జెడ్పీటీసీ కొక్కిస రవీందర్‌గౌడ్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి గురువారం గంగారంలో రవీందర్‌గౌడ్ చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.